
ప్రజాశక్తి

శనివారం 21 సెప్టెంబర్ 2024

5

పార్వతీపురం మన్యం



22న ఉత్తరాంధ్ర స్థాయి పౌరాణిక పద్యనాటక పోటీలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్


స్థానిక లయన్స్ కల్యాణమండపంలో ఈనెల 22న ఉదయం 8 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు నిరంతర ఉత్తరాంధ్ర స్థాయి ఏకాంకిక పౌరాణిక పద్య నాటక పోటీలు జరగనున్నాయి. శ్రీ వాణి ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాల్లో విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాలకు చెందిన పౌరాణిక కళాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శిస్తారని శ్రీవాణి ఆర్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పిజె నాయుడు శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు సాహితీ అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

సాహితీ ప్రపంచంలో

తొలి అడుగు(ర)జాడ

నేడు 162వ జయంతి ● అమలు కాని పాలకుల హామీలు

ఆధునిక కథకు శ్రీకారం చుట్టిన ఆద్యుడు. కథ, కథానికలో ఆయన దిట్ట.. నవయుగ వైతాళికుడు.. తన రచనలతో మెరుగైన ప్రపంచానికి అడుగులు వేసిన అభ్యుదయ వాది.. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారుల్లో ముఖ్యుడు.. ఆయనే గురజాడ వెంకట అప్పారావు. వాసికెక్కిన రచనలతో గురజాడ అప్పారావు వ్యవహార భాషలో ప్రజలందరికీ చేరువయ్యాడు.. అందుకే నవయువ వైతాళికునిగా పేరు గాంచాడు. నేడు గురజాడ అప్పారావు 162వ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం..



ప్రజాశక్తి - విజయనగరంకోట

విశాఖపట్నం జిల్లా యలమంచిలిలోని సర్వసిద్ధి రాయవరంలో 1862 సెప్టెంబరు 21న వెంకటరామదాసు, కౌసల్యమ్మ దంపతులకు గురజాడ వెంకట అప్పారావు జన్మించారు. ఆయన కుటుంబం తాతల కాలంలో కృష్ణా జిల్లా గురజాడ నుంచి విశాఖకు వలస వచ్చింది. అప్పారావు తండ్రి విజయనగరం సంస్థానంలో పెష్కారుగా, రెవెన్యూ సూపర్‌వైజరుగా పనిచేశారు. ఆ సమయంలోనే అప్పారావు చీపురుపల్లిలో చదువుకున్నారు. తర్వాత, తండ్రి మరణించడంతో విజయనగరానికి వచ్చారు. ఇక్కడ చాలా పేదరికంలో ఉంటూ వారాలు చేసుకుంటూ చదువు కొన సాగించారు. ఈ సమయంలో అప్పటి ఎంఆర్ కాలేజీ ప్రిన్సిపల్ సి.చంద్రశేఖరశాస్త్రి ఆయనను చేరదీసి ఉండడానికి చోటిచ్చారు. 1882లో మెట్రిక్యులేషన్ పూర్తిచేసి, తర్వాత 1884లో ఎఫ్ఎ చదివారు. అదే సంవత్సరం ఎంఆర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా చేరారు. విజయనగరంలో బిఎ చదువుతున్నప్పుడు వాడుక భాషోద్యమకారుడు గిడుగు రామ్మూర్తి ఆయనకు సహధ్యాయి.

1885లో అప్పారావుకు అప్పలనరసమ్మతో వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. గిడుగు రామ్మూర్తితో కలిసి అప్పారావు వాడుక భాషా వ్యాప్తికి ఉద్యమించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కన్యాశుల్కం నాటకాన్ని 1890 ప్రాంతాల్లో పూర్తి వాడుకభాషలో రచించారు. ఆ రోజుల్లో ప్రబలంగా ఉన్న కన్యాశుల్కం, వేశ్యవృత్తి వంటి దురాచారాలపై ఇందులో ఆయన దునుమాడారు. 1892లో కన్యాశుల్కం నాటకాన్ని తొలిసారి ప్రదర్శించారు. 1897లో దాని వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ సంస్థ ప్రచురించింది. ఆ తొలికూర్పునే మహారాజా ఆనందగజపతిరాజుకు గురజాడ అంకితమిచ్చారు. ప్రస్తుతం లభిస్తున్న కన్యాశుల్కం రెండో కూర్పును 1909లో రచించారు. 1910లో ఆయన రాసిన 'దేశమును ప్రేమించుమన్నా' దేశభక్తి గీతం ఎంతో పేరు పొందింది. ఆయన కలం నుంచి వెలువడిన పుత్తడి బొమ్మా పూర్ణమ్మా అనే గేయం సుప్రసిద్ధమైంది.

వ్యవహారిక భాషోద్యమం

20వ శతాబ్దం తొలినాళ్లలో జరిగిన వ్యవహారిక భాషో ద్యమంలో గురజాడ అప్పారావు తన సహధ్యాయి గిడుగు రామ్మూర్తితో కలిసి పోరాడారు. ఇద్దరూ కలిసి పత్రికల్లో, సభల్లో, మద్రాసు విశ్వ విద్యాలయంలో గ్రాంధిక భాషా వాదులతో తలపడ్డారు. గిడుగు వాదనా బలానికి, గురజాడ రచనా శక్తి వ్యవహారిక భాషోద్యమానికి ఉపయోగపడ్డాయి. 1913లో అప్పారావు ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడేవారు. నవయువ వైతాళికునిగా పేరుగాంచిన గురజాడ 1915 నవంబర్ 30న భౌతికంగా దూరమయ్యారు.

పాలకుల వట్టిమాటలు.. అమలుకాని హామీలు

గురజాడ జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహిస్తున్నారు. గురజాడ 150వ జయంతి సందర్భంగా గురజాడ నివాసాన్ని మ్యూజియంగా మారుస్తామని, గురజాడ నివాసం పక్కనే స్థలంలో ఆడిటోరియం నిర్మిస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఓపెన్ ఆడిటోరియం నిర్మిస్తామని చెప్పి శిలాఫలకం కూడా ఏర్పాటు చేశారు. కానీ ఇవేవీ ప్రభుత్వాలు మారినా అమలు కాలేదు. పురావస్తు శాఖ 2015 మే 15న ఈ ఇంటిని ఆధీనంలోకి తీసుకుంది. పురావస్తు శాఖ దగ్గర సరిపడా నిధులు లేకపోవడంతో 2023 నవంబర్ నుంచి ఈ గృహ నిర్వహణకు ప్రతినెలా జిల్లా పరిషత్ నుంచి పదివేల రూపాయలు పురావస్తుశాఖ ద్వారా అందజేస్తున్నారు. గత పదేళ్లలో ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు వట్టి మాటలుగానే మిగిలిపోయాయని ప్రజలు, కవులు కళాకారులు, సాహితీవేత్తలు వాపోతున్నారు.

సమాజాన్ని చైతన్యపరచిన గురజాడ భవనాన్ని కాపాడుకోవాల్సిన గురు తన బాధ్యత మన అందరిపైనా ఉంది. గురజాడకు సంబంధించిన రచనలు జ్ఞాపకాలు భావితరాలకు అందించాలని ప్రజలంతా కోరుకుంటున్నారు. గురజాడ దేశభక్తి గేయం సర్వకాలీనం సర్వసమ్మతం అయినందున ప్రతి పాఠశాలలో ప్రార్థన గీతంగా పాడించాలని కవులు, సాహితీవేత్తలు, కళాకారులు, అభిమానులు ప్రజలు కోరుకుంటున్నారు. ఆయన గొప్పతనాన్ని నేటి తరానికి కూడా తెలియజేయాలని ఆశిస్తున్నారు. గురుజాడ కళాక్షేత్రంగా పిలుచుకుంటున్న దాన్ని ఇంకా పెద్దదిగా అభివృద్ధి చేసేందుకు రెండు కోట్ల రూపాయలు కేటాయిస్తామని ఇచ్చిన మాటను కూడా గట్టుమీద పెట్టారే తప్ప అమలు చేయలేదు. జిల్లాలో జెఎన్‌టియు విశ్వవిద్యాలయానికి గురజాడ విశ్వవిద్యాలయంగా పేరు పెట్టి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికైనా గురజాడ మ్యూజియం, ఆడిటోరియం పనులు చేపట్టి ఆయన స్ఫూర్తిని భావితరాలకు అందించాలని కవులు, కళాకారులు, సాహితీప్రియులు కోరుతున్నారు.

నేడు గురజాడ జయంతికి ఏర్పాట్లు

రాష్ట్ర ప్రభుత్వం గురజాడ వారి జయంతిని రాష్ట్ర ఉత్సవంగా ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యక్రమంగా నగరంలో నిర్వహించేందుకు లెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదేశాల మేరకు యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. గురజాడ స్వగహాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. శనివారం ఉదయం 9 గంటలకు గురజాడ స్వగహంలో ఆయన చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలనతో జయంతి కార్యక్రమాలు మొదలవుతాయి. అనంతరం గురజాడ కూడలి వద్ద వారి విగ్రహానికి నివాళు లర్పించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో జయంతి ఉత్సవ సభా కార్యక్రమాలు నిర్వహిస్తారు. గురజాడ వారి రచనలపై పలు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనతో పాటు ప్రముఖుల సందేశాలు, గురజాడ రచనలపై అధ్యయనం చేసిన రచయితలు, కన్యాశుల్కం నాటకాన్ని ప్రదర్శించిన పలువురు కళాకారులను సత్కరించనున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, మేయర్ వి.విజయలక్ష్మి తదితరులు హాజరు కానున్నారు.

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి



కరపత్రాలను పంపిణీచేస్తున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ప్రజా శ్రేయస్సు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మామిడిపల్లిలో మంత్రి పాల్గొన్నారు. ఇందులో భాగంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రతి కుటుంబాన్ని పలకరించారు. వంద రోజుల కార్యక్రమం కింద ముద్రించిన కర పత్రాలు, స్టిక్కర్లను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఉపయోగ పనులను మాత్రమే ప్రభుత్వం చేపడుతుందని స్పష్టం చేశారు. అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం వారం రోజుల పాటు జరుగుతాయని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ సొమ్ము రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచడం, వికలాంగులకు రూ.6వేలు ఇవ్వడం శుభ పరిణామమన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేయడం జరిగిందని పేర్కొన్నారు. వంద రోజుల్లోనే 16,437 డిఎస్‌సి పోస్టుల విడుదల చేశామని, అన్న క్యాంటీన్లను పునరుద్ధరించామన్నారు. ప్రజా ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని, వారికి ఉపయోగపడే పనులనే ప్రభుత్వం చేపడుతుందని మంత్రి తెలిపారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ వంద రోజుల కాలంలో ప్రజలకు సుపరిపాలన అందిస్తామన్నారు. మెగా డిఎస్‌సి విడుదల, పింఛన్లను ప్రభుత్వం సమర్థంగా పంపిణీ చేసిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టకు జిల్లాలో జీవనోపాధులు కల్పన, పర్యాటక రంగం అభివృద్ధి, వ్యవసాయం, పారిశ్రామిక రంగం వంటి రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో రక్తహీనత నివారణ, మాతా, శిశు మరణాల నివారణపై దష్టి సారిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా పొలంబడి పిలుస్తోంది పోస్టరును విడుదల చేశారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహించి ఘనంగా కార్యక్రమానికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జిల్లా అటవీ శాఖ అధికారి జిఎపి ప్రసూన, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

అతుకుబడి భూముల పరిశీలన



అతుకుబడి భూ రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని అతుకు బడి భూములను పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. వెంకటబైరిపురంలోని ఫ్రీ హెూల్డ్, అతుకుబడి భూములు ప్రక్రియ గురించి రైతుల సాగుభూముల విషయమై ఆయన రైతులతో మాట్లాడారు. తహశీల్దార్ షేక్ ఇబ్రహీం వెంకట బైరిపురం ఫ్రీ హెూల్డ్ భూముల వివరాలను సబ్ కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ స్వాతి, స్థానిక విఆర్ఒ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు సిబ్బందిని సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్‌పి మాధవరెడ్డి

పోలీసు సిబ్బంది సమస్యలకు తక్షణ పరిష్కారం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లాలో పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న శాఖాపరమైన, అంతర్గత సమస్యలను పోలీస్ గ్రీవెన్స్ డేలో గుర్తించి తక్షణమే పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన సిబ్బందిగ్రీవెన్స్ డేలో పాల్గొన్నారు. జిల్లా నుంచి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసు సిబ్బంది బదిలీలు, మెడికల్ సమస్యలు దరఖాస్తుల రూపంలో స్వీకరించారు. అనంతరం అర్జీదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలు పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఫిర్యాదులపై సంబంధిత జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులతో ఎస్‌పి మాట్లాడి, పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసిన పాలకొండ డిఎస్‌పి

పాలకొండ డిఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎం.రాంబాబు ఎస్‌పి ఎస్‌వి మాధవ్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతంగా కలగకుండా చర్యలు చేపట్టాలని, గంజాయి నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టి విరివిగా వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాలకు యువత ఆకర్షితులు కాకుండా కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజలకు సైబర్ క్రైమ్ గురించి అవగాహనా కల్పించాలని సూచించారు.

రూ.2.5 కోట్లతో మురుగునీటి శుద్ధి ప్లాంటు

- పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- మున్సిపాలిటీపై కలెక్టర్ సమీక్ష
- ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్‌కు షోకాజ్ లు

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో మురుగు నీటి శుద్ధి చేయడానికి రూ.2.5 కోట్లతో గుమడాంలో ప్లాంటు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ చెప్పారు. శుక్రవారం ఆయన ఉదయం 10.30 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సమయానికి అధికారులు, ఉద్యోగులంతా విధులకు హాజరయ్యారా లేదా అని ఇన్‌ఛార్జి కమిషనర్ రాఘవాచార్యులను ప్రశ్నించారు. అనంతరం మున్సిపాలిటీ సమావేశమందిరంలో చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడుతో కలిసి సమీక్ష నిర్వహించారు. అన్ని విభాగాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య నిర్వహణ ఇంకా మెరుగు పడాల్సి వుందన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బదిలీపై ఎందుకు రిలీవ్ చేశారని ప్రశ్నించారు. అక్కడ నుంచే మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్‌తో మాట్లాడి సమర్థుడైన యువఅధికారిని ఇక్కడకి కమిషనర్‌గా పంపించాలని కోరగా మీరే సూచించాలని మున్సిపల్ డైరెక్టర్ బదులిచ్చారు. ఉద్యోగులు సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉందని కలెక్టర్ శ్యాం ప్రసాద్ చెప్పారు. సమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ కోసం ప్రతి వార్డుకీ ఒక అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. 15రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. గుమడాం వద్ద రెండు ఎకరాల విస్తీర్ణంలో మురుగు నీటి శుద్ధి ప్లాంటు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిఇ శ్రీరామ్మూర్తిని ఆదేశించారు. మున్సిపల్ రెవెన్యూ వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తున్న రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న జూనియర్ అసిస్టెంట్ దేవీ ప్రసాద్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

వార్డుల వారీ రెవెన్యూ వసూళ్లలో వెనుకబడిన సచివాలయ అడ్మిన్‌లకు కూడా షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. పట్టణంలోని సామాజిక మరుగుదొడ్లను పే అండ్ యూజ్ పద్ధతిలో నిర్వహించాలని సూచించారు. వందపడకల ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించి ఒక ప్రశ్న అడగ్గా నిర్మాణ వ్యయం రూ.29 కోట్లకు పెరిగిందని, నిధుల సమస్య కారణంగా జాప్యం జరుగుతోందని చెప్పారు. ఇసుక ఉచితంగానే సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. స్థానిక ఇసుక రీచ్‌ల నుంచి నాటుబళ్లతో రవాణా చేసుకోవచ్చునని, ట్రాక్టర్లతో రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైసిపికి షాక్

రాజీనామా చేసిన జర్జాపు సోదరులు
22న జనసేనలో చేరిక

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గంలో వైసిపికి భారీ షాక్ తగిలింది. గత కొంతకాలంగా పార్టీకి దూరంగా ఉన్న జర్జాపు సోదరులు తమ అనుచరులతో కలిసి పార్టీకి రాజీనామా చేశారు. వైసిపి విజయనగరం నాయకులు అవనాపు విక్రమ్‌తో కలిసి ఆదివారం అమరావతిలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో చేరాలని నిర్ణయించుకున్నారు. అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తితో పాటు కొంతమంది కౌన్సిలర్లతో జనసేనలో చేరాలని నిర్ణయించుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ విషయంలో గతంలో జరిగిన పెద్ద మనుషుల ఒప్పందం అమలు చేయకపోవడంతో జర్జాపు సోదరులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండున్నరేళ్ల తర్వాత చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ స్థానంలో వైస్ చైర్మన్ జర్జాపు దీప్తిని ఎంపిక చేస్తామని పార్టీ పెద్దలు కుదిర్చిన ఒప్పందం అమలు చేయకపోవడంతో కొంతకాలంగా జర్జాపు సోదరులు పార్టీకి దూరంగా వుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత చైర్‌పర్సన్ మార్పు వుంటుందని పార్టీ పెద్దలు హామీ ఇచ్చినా ఆదిశగా వారు ప్రయత్నించకపోవడంతో జర్జాపు సోదరులు పార్టీని వీడాలని నిర్ణయించుకున్నారు. కౌన్సిలర్లు రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు, లింగాల దుర్గా, జర్జాపు నీలిమతో పాటు మరికొందరు కూడా పార్టీని వీడనున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ: పక్కన పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పార్టీలకు అతీతంగా పీసా ఎన్నికలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతంపేట

రాజకీయ పార్టీలకు అతీతంగా పీసా ఎన్నికలు నిర్వహించాలని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్పిటిసిలకు పీసా చట్టం, ఎన్నికల నిర్వహణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ పంచాయతీలో ఏ అభివృద్ధి కార్యక్రమం నిర్వహించాలన్నా పీసా గ్రామసభ తీర్మానం తప్పనిసరిగా ఉండాలని అన్నారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఎటువంటి ప్రచారాలు చేయకూడదని సూచించారు. ఎన్నికకు 1/3 కోరం సభ్యులు ఉండాలన్నారు. ఈ ఎన్నిక ద్వారా ఉపాధ్యక్షున్ని, సెక్రటరీలను ఎన్నుకోవాలని అన్నారు. గిరిజన అభ్యర్థులు మాత్రమే పోటీకి అర్హులన్నారు. ఎమ్మెల్యే జయకృష్ణ మాట్లాడుతూ పీసా చట్టం ద్వారా మన హక్కులు మనం కాపాడుకోగలుగుతామన్నారు. పీసా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పీసా చట్టాన్ని బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ పంచాయతీలకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా పీసా ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈనెల 24 నుండి అక్టోబరు 8 వరకు పీసా ఎన్నికలు నిర్వహించాలని, ఈ ఎన్నికల నిర్వహణకు పూర్తి సహకారం అందించాలని సర్పంచులకు సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ జి.చిన్నబాబు, ఎంపిడిఒ గీతాంజలి, తహశీల్దార్ పి.అప్పలరాజు, ఆటవీశాఖ డిటి కుమారి, ఎంపిపి ఆదినారాయణ, జడ్పిటిసి లక్ష్మి, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిఒకు సత్కారం

అనంతరం స్థానిక ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డిను ఎమ్మెల్యే జయకృష్ణ సాలువతో సత్కరించారు. ఈ సంధర్భంగా గిరిజనుల సమగ్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలని పిఒను కోరారు.

మొక్కలు నాటుదాం... భవితరాలకు మనుగడనిద్దాం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మొక్కలు నాటి భావితరాలకు మనుగడనిద్దామని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గణేష్‌నగర్ కాలనీలో ఎమ్మెల్యే శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిసరాల శుభ్రత, మొక్కలు నాటడం తదితర పనులు నిత్యం చేయడం వల్ల ఆరోగ్యకరమైన పరిసరాలు తయారవుతాయని, మొక్కలు పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాస్, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు బార్నాల సీతారాం, కౌన్సిలర్లు కోరాడ నారాయణ రావు, బడే గౌరు నాయుడు, జనసేన నాయకులు చందక అనిల్ , కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని 35 గ్రామపంచాయతీలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమం కొనసాగుతుంది. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల్లో, బహిరంగ ప్రదేశాల్లో చేపట్టడం జరిగింది. చెత్త కుప్పలను గుర్తించిన పంచాయతీ సిబ్బంది వాటిని చెత్త సంపద కేంద్రాలకు తరలించారు. దీంతో పాటు గ్రామపంచాయతీలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో హెచ్ఎం ఇళ్లా ప్రసన్న లక్ష్మి, సర్పంచ్ తేరేజమ్మ, ఉపసర్పంచ్ అరవింద్ కుమార్, గ్రామపెద్దలు సాల హరగోపాల్, బుడితి శ్రీనివాసరావు, సబ్బాన శ్రీనివాసరావు, సెక్రటరీలు రమేష్, సుధారాణి, ఫీల్డ్ అసిస్టెంట్ అప్పలనాయుడు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని 35 పంచాయతీల్లో శుక్రవారం చేపట్టిన పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.



మొక్కలు నాటున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పైడితల్లమ్మ జాతరకు శ్రీకారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లి అమ్మవారి పండగకు తొలి అడుగు పడింది. అమ్మవారి జాతరలో ప్రారంభ ఘట్టంగా భావించే పందిరి రాట కార్యక్రమం శుక్రవారం అమ్మవారి ఆలయం వద్ద ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు పాల్గొని రాటను ప్రతిష్టించారు. తరువాత పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గుడి ఆవరణలో ఏర్పాటు చేసిన కోలాటాన్ని తిలకించి, వారితో పాటు కోలాటం ఆడి ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ ఈ పందిరి రాటతో అమ్మవారి పండగ మొదలవు తుందని తెలిపారు. 2019లో ఈ పండగను రాష్ట్ర పండగగా నాటి


ఘనంగా పందిరిరాట

ప్రభుత్వం గుర్తించిందన్నారు. అక్టోబర్ 14న తొలేళ్ల ఉత్సవం, 15న సిరిమాను జాతర జరుగుతుందని తెలిపారు. అమ్మవారి దర్శనం చేసుకోవడానికి ఉత్తరాంధ్ర నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని, ఆలయ చైర్మన్ పూసపాటి అశోక్ గజపతి రాజు ఆదేశాలకు అనుగుణంగా భక్తులందరికీ ఉచిత దర్శనం అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, పూజారి బంటుపల్లి వెంకటరావు, ఆలయ సిబ్బంది, టిడిపి నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధికి రూ.15 లక్షలు అందజేత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విజయవాడ వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణలో వచ్చిన రూ. 15 లక్షల 560నగదు ను (చెక్కు రూపంలో) ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం అందజేశారు. నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ తమ వంతు సాయంగా వరద బాధితులకు ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారని ఎమ్మెల్యే సిఎంకు తెలిపారు. ముఖ్యమంత్రి పిలుపు మేరకు స్థానిక ఎమ్మెల్యే, టిడిపి నాయకులు విరాళాల సేకరణలో చేసిన కృషికి సిఎం అభినందించారు. కార్యక్రమంలో టిడిపి అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, నాయకులు దత్తి లక్ష్మణరావు, అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కష్ణబాబు, తెలుగు రైతు అధ్యక్షులు శ్రీరామ్మూర్తి, జియమ్మవలస ఎంపిపి బొంగు సురేష్, గుమ్మలక్ష్మీపురం మండల టిడిపికార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సిఎంకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి, నియోజకవర్గ నాయకులు


ప్రధాన రహదారి పక్కన ఉన్న చెత్త కుప్పలు

స్వచ్ఛత హి సేవ అంటే ఇదేనా ?

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి... ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలంటూ ఈనెల 17న స్వచ్ఛతాహిసేవ కార్యక్రమం వీరఘట్టం మేజర్ పంచాయతీలో అట్టహాసంగా ప్రారంభించారు. ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ, వంటి కార్యక్రమాలు చేపట్టి అధికారులు మమ అనిపించుకున్నారు. ఆ తర్వాత ఎక్కడ చూసినా చెత్తాచెదారాలు కుప్పలు తెప్పలుగా పడి దర్శనమిస్తున్నాయి. దీంతో ఇదేనా స్వచ్ఛతాహి సేవ అంటూ స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి ప్రకటనలకు పరిమితం కాకుండా పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. మండల కేంద్రంలోని తెలగ వీధి, గాసి వీధి ప్రధాన రహదారిలో కుప్పలు తెప్పలుగా చెత్త దర్శనం ఇవ్వడంతో అధికారుల పనితీరు ఏ విధంగా ఉందో వీటిని చూస్తే అర్థం చేసుకోవచ్చు.

వికలాంగుల పరిరక్షణ సేవా సమితిని బలోపేతం చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లాలోని వికలాంగులంతా జిల్లా పరిరక్షణ సేవ సమితిలో సభ్యులుగా చేరి సంఘాన్ని బలోపేతం చేయాలని ఆ సంఘం అధ్యక్షులు పిట్టా గంగులు కోరారు. శుక్రవారం పార్వతీపురం జిల్లా కేంద్రంలో ఆ సంఘం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, వికలాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సమకూర్చే వివిధ సంక్షేమ పథకాల లబ్ధిని పొందేందుకు దివ్యాంగులంతా సంఘటితం కావాలన్నారు. కొత్త జిల్లాలో ఏర్పాటైన ఈ సంఘంలో జిల్లాలో గల వారంతా ఈ సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు. సంఘంలో సభ్యులుగా చేరదలిచే వారు 852 00 60 737 నంబరు కు సంప్రదించి తమ వివరాలను అందించాలని కోరారు.

ఏకలవ్య పాఠశాలలో గ్రంథాలయం ప్రారంభం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఏకలవ్య పాఠశాలలో శుక్రవారం గ్రంథాలయాన్ని నంది అవార్డు గ్రహీత, మండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాలక దేవానంద్ ప్రారంభించారు. పుస్తకం మనకు స్నేహితునిలా ఉండాలని, పుస్తక పఠనం ద్వారా భాషా జ్ఞానం, ఆలోచన పెరుగుతున్నదని, చిన్నప్పటి నుంచి పుస్తకాలను చదివే అలవాటు చేసుకోవాలని చెప్పారు. ప్రిన్సిపల్ పెంటన్న మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వల్ల విజ్ఞానం పెరుగుతుందని, విజ్ఞానం పెరిగితే ప్రపంచం మనదగ్గరకు వస్తున్నదనీ అన్నారు. ఈ పుస్తకాలను ఎన్ఆర్ఐ సభ్యులు రూ.42వేలతో సుమారు 800ల పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. అనంతరం నంది అవార్డు గ్రహీత దేవానంద్ కు విద్యార్థులు, ఉపాధ్యాయులు సన్మా నించారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలో విద్యార్థినిలకు పోక్సో కేసులు, బాల్యవివాహాలపైనా, మహిళలపై జరుగుతున్న నేరాలపై ఎస్ఐ పి.రమేష్‌నాయుడు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీలపైనా, పిల్లలపైనా జరుగుతున్న నేరాలు గూర్చి వివరించారు. ముఖ్యంగా బాలికలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లను గూర్చి వివరించారు. కుటుంబ సభ్యులు ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. విద్యార్థులు జాగ్రత్తలు పాటించే నడుచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ స్పెషల్ ఆఫీసర్ ఎన్.ఛాయాదేవి, గ్రామ మహిళా పోలీస్ ఉరిటి హేమలత పాల్గొన్నారు.

భూమి ఇవ్వాలని గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి - వీరఘట్టం

సెంటు భూమిలేని ప్రతి కుటుంబానికి హెక్టార్ భూమి ఇవ్వాలని సిపిఐఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.భాస్కరరావు మాట్లాడుతూ గిరిజన ఆదివాసీ గ్రామాల్లో గల భూములకు అడంగల్ రావడం లేదని, 1 బి అడంగల్ కొంతమందికి వచ్చిన పాస్‌పుస్తకాలు మాత్రం ప్రభుత్వం ఇవ్వలేదని అన్నారు. ఈ సమస్య మండలంలో తీవ్రంగా ఉందన్నారు. విఆర్ఎలు, విఆర్ఒలు సమాచారం తప్పు ఇచ్చినందున ఇలాంటి సమస్య తలెత్తుతుందని, కొంతమంది చేతుల్లో భూమి పట్టాలు ఉన్నా భూమి లేదన్నారు .రెవెన్యూ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయ ణకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో గిరిజనులు, తదితరులు, పాల్గొన్నారు.

డిఎస్‌పి రాంబాబు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - పాలకొండ



స్థానిక డిఎస్‌పిగా ఎం.రాంబాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళం ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పని చేస్తున్న ఈయన బదిలీపై పాలకొండ డిఎస్‌పిగా బాధ్యతలు తీసుకున్నారు. ముందుగా పాలకొండ కోటదుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు స్వాగత ఏర్పాట్లు చేశారు. అనంతరం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలపై దృష్టి పెడతానన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కారిస్తానని, దసరా ఉత్సవాలలో కూడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని ఎంఇఒ డి.గౌరు నాయుడు సూచించారు. శుక్రవారం వీరఘట్టంలోని కూరాకుల వీధిలో గల ఎంపిపి పాఠశాలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలను ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంచాలన్నారు. పిల్లలకు రుచికరమైన భోజనం అందించేలా చూడాలన్నారు. పాఠశాల ఆవరణలో బడితోటపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు మెరుగైన బోధన అందించాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు డి.శ్రీనివాసరావు, వి.నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - వీరఘట్టం

వీరఘట్టం- పాలకొండ ప్రధాన రహదారి వండువ సమీపాన భారీ వాహనాల రాకపోకలు వల్ల ప్రధాన రహదారి ఎక్కడికక్కడే గోతులు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి వర్షపు నీరంతా గోతిలో నిండిపోవడంతో ఏది గొయ్యో ఏది న్యాయో తెలియని పరిస్థితిలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి ఈ విధంగా ఉండడం వల్ల తరచుగా వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు.


గోతుల మయమైన పాలకొండ- వీరఘట్టం రోడ్డు

సంక్షోభంలోనూ సంక్షేమం :ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రాష్ట్రం ఆర్థికంగా సంక్షోభ పరిస్థితుల్లో ఉన్నప్పటికీ సంక్షేమం అందించి పేదలకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మండలంలోని ములగలో టిడిపి అరకు పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జి కిడారు శ్రావణ్ కుమార్‌తో కలిసి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించి, ప్రతి ఒక్కర్ని కలిసి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్ర పరిస్థితులు వారికి వివరించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజులైందని, ఈ సందర్భంగా అందర్నీ కలుసుకొని కష్టసుఖాలు తెలుసుకోవాలని ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తామన్నారు. అనంతరం కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో చాలా మేర తాగునీరు ఉండేది కాదనిఅప్పట్లో చంద్రబాబు నాయుడు గిరిజన ప్రాంతాలకు తాగునీటి సౌకర్యం కల్పించారని అన్నారు. అనంతరం గ్రామస్తులను కలిసి వారి కష్టాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అకిబు జావేద్, మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు జి చంద్రమౌళి, బి చంద్రమౌళి, నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, పలువురు అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొమరాడ : కూటమి ప్రభుత్వం ఏర్పడిన వందరోజులకు ప్రభుత్వం అందజేసిన మంచి కార్యక్రమాలు ప్రజలకు తెలియజేయాలని డ్వామా పీడీ కె.రామచంద్రరావు అన్నారు. మండలంలోని అర్తాంలో స్థానిక సర్పంచ్ గాజుల శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లికార్జునరావు, కూటమి నాయకులు శేఖర్ పాత్రుడు, నంగిరెడ్డి మధుసూదనరావు, అరకు పార్లమెంట్ రైతు కమిటీ అధ్యక్షులు దేవకోటి వెంకటనాయుడు, పలువురు నాయకులు, కార్యకర్తలు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని 21 సచివాలయాల పరిధిలోని 35 గ్రామపంచాయతీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం అందజేసిన గోడపత్రికలను ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది దగ్గరుండి అతికించారు. ఈ కార్యక్రమం ఆవశ్యకతను వివరించారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు పెంట సత్యంనాయుడు, రౌతు వేణుగోపాలనాయుడు తెలిపారు.


కురుపాంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కురుపాం : ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శమంతినివలసలో ఎంపిడిఒ ఎస్. అప్పారావు టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం 100 రోజు పరిపాలనలో ప్రజలకు ఏం చేసిందో వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కె.చంద్రశేఖర్, బి.అనిత, టిడిపి నాయకులు ఎం.త్రిపురనాథ్, సుకేష్ చంద్ర పండా, బి.రామకష్ణ, కె.శ్రీను, పి.సురేష్, ఎస్.వెంకటరమణ, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నోటీసులివ్వడం సరికాదు

ప్రజాశక్తి - కొమరాడ

65 ఏళ్లుగా సాగు చేస్తున్న భూమిని ఇప్పుడు రెవెన్యూ అధికారులు భూమి సాగు చేస్తున్న రైతులకు నోటీసులివ్వడం సరి కాదని సిపిఎం నాయకులు కొన్ని సాంబమూర్తి అన్నారు. కొమరాడ బాధిత రైతులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కొమరాడలో గొర్లి సాంబమూర్తి, పాటూరు రామినాయుడు, మరడాన అప్పలనాయుడు, కిల్లాడ జనార్ధన నాయుడు కొమరాడ రెవెన్యూ పరిధిలో గల 339/4 లో ఎకరా 58 సెంట్లు ప్రభుత్వం భూమిని ఆక్రమించారని ఈ భూమికి సంబంధించి 10/7/1991లో కొమరాడకు చెందిన మాజీ సైనిక ఉద్యోగి మడక విజయ భాస్కరరావుకు పట్టా ఇవ్వడం జరిగిందని తెలిపారు. వెంటనే మీరు ఖాళీ చేయాలని ఈనెల 19న గురువారం పేద రైతులకు నోటీసులు ఇవ్వడం ఎంతవరకు న్యాయమని అన్నారు. సుమారు 65 ఏళ్లుగా ఈ సర్వే నెంబర్లలో గల భూమిని సాగు చేస్తున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ఈ భూమి ఖాళీగా ఉందా ? ఎవరు సాగు చేస్తున్నారా అన్న విషయాన్ని పరిశీలించుకుండా భూమి వద్దకు వెళ్లకుండా మాజీ సైనికుడ్ని మోసగించేలా పట్టా ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. మాజీ సైనికునికి పట్టా ఇవ్వక ముందు నుండే పేద రైతులు ఈ భూమి సాగు చేస్తున్నారని ఈ విషయంపైన కోర్టులో కూడా దావా నడుస్తుందన్నారు. మరి ఇలాంటి సందర్భంలో ఈ భూమిని మాజీ ఆర్మీ సైనికునికి ఇచ్చామని, మీరు వెంటనే ఖాళీ చేయాలని నోటీసలివ్వడం ఎంతవరకు సమంజసమని అన్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి దర్యాప్తు చేపట్టి వాస్తవాలు తెలిపి బాధితు రైతులకు న్యాయం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో బాధిత రైతులు పాల్గొన్నారు.

నేడు అన్న క్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్‌ను శనివారం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరు కావాలని కోరారు.


మరమ్మతులకు గురైన పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

పైపులైన్లకు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని రెండో వార్డులో గల కొత్త వీధిలో ప్రధాన పైప్‌లైన్లు మరమ్మతులు చేపట్టకపోవడంతో తాగు నీరు వృథాగా పోతుందని, పక్కనే ఉన్న కుళాయిలకు నీటి వేగం తగ్గిపోతుందని వెంటనే మరమ్మతులు చేపట్టాలని పట్టణ సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్త వీధి చివర్లో మరమ్మతులకు గురైన పైప్ లైన్లను సిపిఎం బృందంగా పరిశీలించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిరా, పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు పైపులైన్ల నిర్వహణ పనుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఐదేళ్ల నుంచి కొత్త వీధి చివరలో, త్రినాధ స్వామి వారి కోవెల పక్కన మెయిన్ పైపులైను లీకవుతూ నీరు వృథాగా పోతుందని అన్నారు. ఈ విషయమై స్థానికులు గతంలో ఉన్నతాధికారులకు తెలియజేస్తే పైపులైనుకు మరమ్మతులు చేపట్టకుండా మట్టిని తెచ్చి పూర్తిగా కప్పివేశారని, అయినా నీరు వృథాగా పోతూనే ఉందని తెలిపారని అన్నారు. లీకైన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టకుండా మట్టితో కప్పిపెట్టడాన్ని ఖండించారు. కొళాయిలు వస్తున్న సందర్భంలో కనీసం పాతికిళ్లకు సరిపడే నీరు వృథాగా పోతున్నట్లు స్థానికులు తెలిపారని, అలాగే వీటికి పక్కనే ఉన్న ప్రభుత్వ కొళాయికి కూడా ట్యాపులేందున నీరు వృథాగా పోతుందని అన్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి లీకవుతున్న మెయిన్ పైప్ లైన్ గొట్టాలను మరమ్మతులు చేపట్టి లీకులను ఆపాలని, జనరల్ కొళాయికు కూడా ట్యాపును నిర్మించి, కొత్త సిమెంట్ దిమ్మెను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.సూరిబాబు, గౌరి, రాజు, రాజశేఖర్ పాల్గొన్నారు.

పశువులు తరలిస్తున్న మూడు వ్యాన్లు పట్టివేత

పాచిపెంట : ఒడిశా నుండి అక్రమంగా పశువులు రవాణా చేస్తున్న మూడు బొలోరా వ్యాన్లను పాచిపెంటి ఎస్ఐ వెంకట సురేష్ అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి మండలం పీకోనవలస చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం వాహనాల తనిఖీలు భాగంగా ఒడిస్సా నుండి మానాపురం సంతకు వ్యాన్లలో దున్నపోతుల్ని తరలిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వాహన చోదకులు, వాహన యజమానులపై కేసు నమో చేసినట్లు ఎస్సై తెలిపారు.

120 మందికి నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మూలిగూడ జంక్షన్‌లో ఎస్ సొసైటీ సహకారంతో పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమై ఒందని పుష్పగిరి సిఎస్ఆర్ మేనేజర్ రమాదేవి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 120 మందికి కంటి తనిఖీలు నిర్వహించగా ఇందులో 46 మందికి శస్త్ర చికిత్సలు అవసరమయ్యాయని తెలిపారు. వీరిందరికీ శస్త్ర చికిత్సల నిమిత్తం తీసుకెళ్తామన్నారు. చికిత్సల అనంతరం మూడు రోజుల తర్వాత తిరిగి స్వస్థలాలకు పంపించిన తర్వాత ఫాలో అప్ ట్రీట్మెంట్ నిర్వహిస్తామని అన్నారు. శిబిరం విజయవంతమవ్వడానికే సహకరించిన ఎస్ సొసైటీకి సర్పంచ్ పి.అజ్జరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, పుష్పగిరి ఆసుపత్రి వైద్యులు వెంకటేష్, లిఖిత, బిజినెస్ డెవలప్మెంట్ హెడ్ భీమ శంకర్, కో ఆర్డినేటర్ సత్య నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రి నుంచి వచ్చిన వైద్య సిబ్బంది గుమ్మలక్ష్మీపురంలో పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. 14మందిని శుకంటి ఆపరేషన్ల కోసం రిఫర్ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గౌరీ శంకర్రావు, ఉప సర్పంచ్ కిషోర్ ఉన్నారు.


రోగికి నేత్ర పరీక్ష చేస్తున్న వైద్యుడు

పాఠశాల విద్యార్థులకు నేత్ర పరీక్షలు

కొమరాడ : పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నేత్ర వైద్య అధికారి నగేష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం రాజ్యలక్ష్మీపురం పాఠశాలలో నేత్ర వైద్య సహాయకులు సన్యాసమ్మ కంటిపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలో ఇప్పటివరకు 2300 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి 93 మందికి దృష్టి దోషం వున్నట్లు గుర్తించినట్లు నగేష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమములో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచుల ఖాతాలకు ఉపాధి బిల్లులు జమచేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ఉపాధి హామీ చట్టం ప్రకారం గ్రామసభల ద్వారా మంజూరైన ఉపాధి హామీ పనుల చెల్లింపులు గ్రామ సర్పంచ్ బ్యాంకు ఖాతాలో జమ చేయాలని పలువురు ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జడ్పీ వైస్ చైర్మన్ కొర్ర జన్ని సింహాచలం, వైస్ ఎంపిపి కె.రవీంద్ర మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం నిబంధనల ప్రకారం సర్పంచుల ప్రాధాన్యత మేరకు గ్రామాల్లో పనులు మంజూరు చేయాలని, పనుల అనంతరం బిల్లులు సర్పంచుల ఖాతాలో జమ చేయాలని తెలిపారు. సర్పంచ్‌కు ఎగ్జిక్యూటివ్ అధికారాలు ఇవ్వాలని ఉపాధి హామీ చట్ట నిబంధనలు చెబుతున్నాయని, ఇలా అయితే టిడిపి అభివృద్ధి పనులకు సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు గొట్టాపు ముత్యాలునాయుడు, నాయకులు డోల బాబ్జీ, పి.వీరంనాయుడు, టి.గౌరీశ్వరరావు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.


ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు

జాతీయస్థాయిలో రాణించాలి

ప్రజాశక్తి - సీతంపేట

క్రీడల్లో విద్యార్థులు జాతీయ స్థాయికి రాణించాలని ఐటిడిఎ ఎపిఒ చినబాబు అన్నారు. శుక్రవారం స్థానిక గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్ గేమ్స్ వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికితీసి ప్రపంచానికి పరిచయం చేయడానికి ఎంతో దోహతాపడుతుందని, ఇలాంటివి విద్యార్థులు వినియోగించుకోవాలని అన్నారు. క్రీడల వల్ల చదువుతోపాటు ఆరోగ్యానికి మేలన్నారు. నియోజకవర్గ క్రీడల పోటీలకు ఒక్కొక్క మండలం నుండి 150 మంది విద్యార్థులు చొప్పున నాలుగు మండలాల నుండి 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీటిలో ఖోఖో, వాలీబాల్, చెస్ బాడ్మింటన్ కబడీ తదితర పోటీలు నిర్వహించారు. ఐటిడిఎ క్రీడల పర్యవేక్షణ అధికారి ఎన్ జాకబ్ దయానంద్ విద్యార్థులకు తాగునీరుతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించారు. కార్యక్రమంలో ఎటిడబ్ల్యుఒ జి.మంగవేణి, ప్రధానోపాధ్యాయులు టి.చంద్రరావు, పి.పద్మశ్రీ, ఎంఇఒ సూర్యచంద్రరావు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు అధ్యక్షులు రాజేంద్ర, పలువురు పిఇటిలు పాల్గొన్నారు.


బ్యాడ్మింటన్ ఆడుతున్న విద్యార్థినులు

పార్వతీపురం రూరల్ : మండలంలోని నర్సిపురం జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నియోజకవర్గం స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14, 17 బాల బాలికల అథెలిటిక్స్, చదరంగవు ఎంపిక పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాలకు చెందిన ఉన్నత పాఠశాలల విద్యార్థులు సుమారు 300 మంది హాజరైనట్లు ప్రధానోపాధ్యాయులు కె.వెంకట నాయుడు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు మంచిన వాసుదేవరావు, కె.తిరుపతిరావ, పాఠశాల వ్యాయామ సంచాలకులు ఎస్.మురళి, డిటి గాంధీ, జి.సింహాచలం, బి.చిట్టిబాబు పాల్గొన్నారు.

తిరుపతి లడ్డు కల్తీపై సమగ్ర విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - కురుపాం

తిరుపతి లడ్డుతో సహా వైసిపి ప్రభుత్వం గత ఐదేళ్లలో చేసిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి లడ్డూకి ప్రపంచ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు ఉందని, అలాగే ఏటా కోట్లాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారని, భక్తులు తినే ఆహారం, లడ్డూను కల్తీ చేయడం దారుణమని విమర్శించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి, దేశ ఔన్నత్యాన్ని కాపాడాలని కోరారు.

సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - బలిజిపేట

మండల విద్యా శాఖ పరిధిలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలను సిఆర్ఎంటిలు పక్కాగా పర్యవేక్షించాలని ఎంఇఒ-1 సామల సింహాచలం అన్నారు. శుక్ర వారం స్థానిక ఎంఇఒ కార్యాలయంలో సిఆర్ఎంటిలు, ఆఫీస్ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యా కార్యక్రమాలను పాఠశాలల్లో చక్కగా అమలు జరిగేలా సిఆర్ఎంటిలు తమ విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. డ్రాపౌట్స్‌ను పాఠశాలల్లో చేర్పించడం, విద్యా శాఖ పరంగా అవసరమైన సమాచారం సేకరణ , స్కూల్ కాంప్లెక్స్ విషయాలు పరిశీలన, బడి తోట ప్రతి పాఠశాలలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే ఆఫీస్ సిబ్బంది కూడా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా జిల్లా విద్యా శాఖకు వారు కోరిన వివరాలను జాప్యం లేకుండా అందజేయాలని కోరారు. సమావేశంలో ఎంఇఒ -2 కె.శ్రీనివాసరావు, సిఆర్ఎంటిలు, ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్‌తో మహిళలకు ఉపాధి

ప్రజాశక్తి -భామిని

టైలరింగ్ నేర్చుకోవడం ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూర్చడమే కాకుండా, కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించగలరని హెూలీ క్రాస్ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ తెలిపారు. హెూలీ క్రాస్ సంస్థ బాలికలు, మహిళలకు 35 మందికి ఉచిత టైలరింగ్ శిక్షణ అందించారు. మూడు నెలల శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి శిక్షణ సర్టిఫికెట్లను శుక్రవారం అందజేశారు. మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇవ్వడమే కాకుండా, రుతపరిశుభ్రతపై అవగాహన, పర్యావరణ అనుకూల శానిటరీ ప్యాడ్లు తయారీపై శిక్షణ, సింథటిక్ శానిటరీ ప్యాడ్లు వినియోగం వల్ల కలిగే అనార్థాలను వివరించామని ప్రభుదాస్ తెలిపారు. కార్యక్రమంలో టైలరింగ్ బోధకులు రమాదేవి ఉన్నారు.

నిరుద్యోగ వేద పండితులకు నిరుద్యోగ భృతి

ప్రజాశక్తి - పార్వతీపురం

వేద విద్యను అభ్యసించిన నిరుద్యోగ వేద పండితులకు నిరుద్యోగ భృతి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనరు కెఎల్ సుధారాణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తులను ఈనెల 26లోగా సమర్పించాలని ఆమె తెలిపారు. రాష్ట్రంలో వేద విద్యను అభ్యసించిన నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలో వేద విద్యను అభ్యసించి నిరుద్యోగులుగా ఉన్న అభ్యర్థులు భృతిని పొందేందుకు వేద విద్య (క్రమాంతం ఆపై కోర్సులు చదివిన వారు) సర్టిఫికెట్ల నఖలు, ఆధార్ నఖలు, ఏ విధమైన ఉద్యోగం చేయలేదని తెలియజేస్తూ స్వీయ ధ్రువ పత్రంతో దరఖాస్తులను జిల్లా దేవాదాయ శాఖ అధికారి, దేవాదాయ ధర్మదాయ శాఖ, పార్వతీపురం మన్యం వారి కార్యాలయానికి ఈనెల 26 లోగా సమర్పించాలని సుధారాణి తెలిపారు.

పాంచాలిలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులు ఎలాంటి రసాయనాలు పిచికారీ చేయకుండా తమ ఇంటి వద్ద లేదా తమ పొలం గట్ల మీద లేదా 10 సెంట్ల భూమిలో ఎటిఎం లేదా ఎ-1 కూరగాయల నమూనాలను వేసుకుంటే ఏడాది మొత్తం ఇంటికి కావాల్సిన ఆరోగ్యవంతమైన కూరగాయలు అందడంతో పాటు అదనపు ఆదాయం కూడా లభిస్తుందని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని చాపరాయివలసలో చదల రాజు వేసిన ఎ-1 కూరగాయల నమూనాను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులంతా ప్రకృతి సేద్యం దిశగా ప్రయాణించాలని అతి తక్కువ ఖర్చుతో అధిక లాభాలిచ్చే చిరుధాన్యాలు వంటి పంటలను పండించాలన్నారు. అనంతరం తెగుళ్ల నివారణకు పేడ- మూత్రం- ఇంగువ ద్రావణం తయారీ ఉపయోగాలను వివరించారు. అలాగే పాంచాలి రైతు భరోసా కేంద్రం వద్ద సిఆర్‌పి తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో 200 లీటర్ల జీవామృతం తయారీని వివరించారు. కార్యక్రమంలో ఎల్ టు సురేష్ కుమార్, విఎఎ ఈదిబిల్లి శ్రీను, రైతులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

యూనియన్ బ్యాంక్ అధికారులకు తెలుగు భాషపై శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం

తెలుగు నేర్చుకోవడం ద్వారా ఖాతాదారులతో బ్యాంకింగ్ వ్యవహారాలు సులభతరవుతాయని యూనియన్ బ్యాంక్ జోనల్ (ముంబై) ఎజిఎం వివేకానంద అన్నారు. హిందీ ప్రచార సభ హైదరాబాద్ ద్వారా యూనియన్ బ్యాంక్ అధికారులు, ఉద్యోగులకు తెలుగు భాషా శిక్షణా కార్యక్రమాన్ని విశాఖపట్నం లోని యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం ప్రారంభించి ఆయన మాట్లాడారు. తెలుగు మాతృభాష కానటువంటి బీహార్, ఒరిస్సా తదితర రాష్ట్రాలకు చెందిన యూనియన్ బ్యాంక్ అధికారులకు ఈ తెలుగు శిక్షణ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివేకానంద అన్నారు. డిజిఎంలు శంకర్ హెంబ్రం, ఆర్.నరసింహ కుమార్ మాట్లాడుతూ తెలుగు నేర్చుకొని తద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. హిందీ ప్రచార సభ హైదరాబాద్ ఉపాధ్యక్షులు మంచిపల్లి శ్రీరాములు మాట్లాడుతూ, 1935 నుండి హిందీ ప్రచార సభ హైదరాబాద్ ద్వారా హిందీ మరియు ప్రాంతీయ భాషల బోధన జరుగుతున్నట్లు తెలిపారు. వేలాది మందిని ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దిన ఘనత హిందీ ప్రచార సభదేనన్నారు. ప్రచార సభ జనరల్ సెక్రెటరీ ఎస్. గైబువల్లి మాట్లాడుతూ, తెలుగు శిక్షణ తరగతులు వారానికి రెండు చొప్పున, పది వారాలు పాటు 20 తరగతులు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో హిందీ ప్రచార సభ రాష్ట్ర అధ్యక్షులు సి.ఎల్. నాయుడు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కోనే శ్రీధర్, యూనియన్ బ్యాంక్ ఏజీఎం కేవిఎల్ రమేష్, బ్యాంక్ హిందీ అధికారులు లక్ష్మి, అభిజిత్ తదితరులు మాట్లాడారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు కార్యక్రమంలో నగరంలోని వివిధ శాఖలకు చెందిన యూనియన్ బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.